క్లుప్తంగా

ఉత్సాహంగా చిత్రలేఖనం పోటీలు



పోటీలో పాల్గొన్న చిన్నారుల

శ్రీకాకుళం కల్చరల్: పొన్నాడ బ్రిడ్జి వద్ద గల ఇస్కాన్ జగన్నాథ మందిరం ఆధ్వర్యంలో బుధవారం చిన్నారులకు శ్యామా పేరుతో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. రామాయణం, మహాభారతం, కృష్ణలీలల ఇతివృత్తంపై చిన్నారులు చక్కటి బొమ్మలు గీశారు. విజేతలకు ఆగస్టు 17న జరిగే కృష్ణాష్టమి వేడుకల నాడు బహుమతులు అందజేస్తామని ఇస్కాన్ నిర్వాహకులు లక్ష్మీపతిదాస్ తెలిపారు.

పార్టీ బలోపేతానికి కృషి

ఎచ్చెర్ల : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ విభాగం జాయింట్ సెక్రటరీగా లావేరు మండలం మురపాక గ్రామానికి చెందిన సర్పంచ్ పెయ్యల లక్ష్మణరావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవిని అప్పగించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి, సహకరించిన ఎచ్చెర్ల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



నివాళులు అర్పిస్తున్న గొర్లె కిరణ్‌కుమార్

రణస్థలం: నగరప్పాలెం మాజీ సర్పంచ్, ఎఫ్ఎస్‌సీఎస్ మాజీ అధ్యక్షుడు కరిమజ్జి భాస్కరరావు తల్లి లక్ష్మీనారాయణమ్మ అనారోగ్యం మృతి చెందారు. ఆమె భౌతికకాయాన్ని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ బుధవారం సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అలాగే ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాంతో పాటు పలువురు నాయకులు అంతిమయాత్రలో పాల్గొన్నారు.

మోసగించడమే చంద్రబాబు నైజం

జి.సిగడాం: ఎన్నికల ముందుకు ప్రజలకు అనేక హామీలు ఇచ్చిన చంద్రబాబు గద్దెనెక్కిన తరువాత అమలు చేయకుండా అన్నివర్గాలను మోసం చేస్తున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పేడాడ శ్రీరామమూర్తి అన్నారు. బుధవారం దవళపేటలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎటువంటి సంక్షేమ పథకాలు అమలు చేయకుండా సుపరిపాలన తొలి అడుగు పేరుతో గ్రామాల్లో కూటమి నాయకులు పర్యటించడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజలను మోసగించడమే చంద్రబాబు నైజమన్నారు. గ్రామాల్లో భర్త మరణిస్తే వారికి అందాల్సిన వితంతు పింఛన్లు ఇంత వరకు మంజూరు చేయలేదన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న డీఎస్పీ వివేకానంద

రణస్థలం: చదువుతోపాటు చట్టాలపైనా అవగాహన కలిగి ఉండాలని శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద అన్నారు. రణస్థలం మండలం లంకోపేట కేజీబీవీలో బుధవారం విద్యార్థినులకు శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలకు దూరంగా ఉండాలని, 18 ఏళ్లు దాటితేనే ఎటువంటి సమస్యనైనా ఎదుర్కొనవచ్చునని చెప్పారు. బాలికలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఆన్‌లైన్ మోసాలు, మహిళల భద్రత, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జె.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి, ప్రిన్సిపాల్ హైమావతి, సిబ్బంది పాల్గొన్నారు.

చెట్టు నరికివేతపై ఫిర్యాదు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని బొందిలీపురంలో తన నివాసం వద్ద సిరిగంధం చెట్టును గుర్తు తెలియని వ్యక్తులు నరికేసి పట్టుకుపోయారని కె.రాంగోపాల్‌సింగ్ అనే వ్యక్తి రెండో పట్టణ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి ఇలా చేశారని పేర్కొన్నారు. గతంలోనూ ఇదే విధంగా చేశారని, అప్పట్లో కూడా రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

శ్రీకాకుళం రూరల్: పెదగనగళ్లవానిపేట, బందరువానిపేట గ్రామాల పరిధిలో పేకాట ఆడుతున్న వారిపై శ్రీకాకుళం రూరల్ పోలీసులు బుధవారం ఏకకాలంలో దాడులు నిర్వహించారు. వారి వద్ద నుంచి రూ.12వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. సుమారు పది మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఎస్ఐ రాము కేసు దర్యాప్తు చేస్తున్నారు.



↑ జాడ గ్రామంలో వరినారు బతికించేందుకు రైతన్నల ఆరాటం

ఇదీ పరిస్థితి..

జి.సిగడాం మండలంలో 42 రెవెన్యూ గ్రామాల్లో 18 వేల ఎకరాల్లో వరిసాగు చేస్తున్నారు. వీటికి సంబంధించిన వరినారు కూడా సిద్ధం చేశారు. వరుణుడు కరుణిస్తాడనే ఆశతో రైతన్నలు ఎదురు చూస్తున్నారు. మెట్టు ప్రాంతాల్లో మొక్కజొన్న అధిక శాతం విస్తీర్ణంలో సాగుచేశారు. ఈ పంటలు కూడా మొక్కదశలోనే ఉన్నప్పటికీ వర్షాలు లేకపోవడంతో ఎండిపోతున్నాయి.

కరుణించని వరుణుడు

- జూలై మాసం సగం దాటినా జాడ లేని వర్షాలు
- పూర్తిస్థాయిలో ప్రారంభం కాని ఉభాలు
- ఎండిపోతున్న వరినారు, మొక్కజొన్న పంటలు
- ఆందోళనలో రైతులు



చంద్రయ్యపేటలో వ్యవసాయ పొలం వద్ద పశువులు

జి.సిగడాం : అన్నదాతలకు సాగునీటి కష్టాలు వీడటం లేదు. వర్షాల జాడ లేకపోవడంతో ఏం చేయాలో తోచక తీవ్ర ఆందోళన చెందుతున్నారు. దీంతో ఖరీఫ్ సీజన్ మొదలైనా ఉభాలు ప్రారంభం కాని పరిస్థితి. ఇటీవల అడపాదడపా పడిన వర్షాలకు వరినారు, మొక్కజొన్న పంటలకు జీవం వచ్చింది. తర్వాత ఎండలు ఠారెత్తిస్తుండటంతో అవన్నీ ఎండిపోయే దశకు చేరుకుంటున్నాయి. దీంతో రైతులు తీవ్ర వ్యయప్రయాలకు ఓర్చి దూర ప్రాంతాల నుంచి నీటిని తెచ్చి నారును బతికించుకుంటున్నారు. ఏటా జూన్ మొదటి వారంలోనే వర్షాలు సమృద్ధిపడి విత్తనాలు వేసుకునే పరిస్థితి ఉండేది. ఈ ఏడాది మాత్రం జూలై నెల సగం దాటినా చినుకు జాడే లేదు.

ఎండిపోతున్న నారు..

వరి విత్తనాలు వేసి నెల రోజులు కావస్తున్నా నీరు లేక మొలకెత్తడం లేదు. దీంతో ఉభాలు జరగక రైతులు ఆందోళన చెందుతున్నారు. చెట్టుపొదిలాం, ఎస్.పి.ఆర్.పురం, వాండ్రంగి, జి.సిగడాం, మధుపాం, నడిమివలస, వెలగాడ, దేవరవలస, చంద్రయ్యపేట, పెనసాం, ఎందువ, వెంకయ్యపేట, డి.ఆర్.వలస ముషినివలస తదితర గ్రామాల్లో 75 శాతం మొక్కజొన్న సాగు చేశారు. నీరు లేక పంటకు నష్టం వాటిల్లుతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

పంట కష్టమే..



మెట్టు ప్రాంతాల్లో మొక్కజొన్నపంట సాగు చేస్తున్నాం. సకాలంలో వర్షాలు కురవకపోవడంతో పంటంతా నాశనం అవుతోంది. ఇప్పటికే వేలాది రూపాయలు మదుపులు పెట్టాం. చివరికి కష్టమే మిగులుతోంది.

– బాలి అప్పలసూరి, రైతు, నడిమివలస, జి.సిగడాం

ఈ ఏడాదీ కరువే



ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల దాటినా వర్షాల జాడే లేదు. ఇప్పటికే వరినారు, మొక్కజొన్న పంటలు ఎండిపోతున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే ఈ ఏడాది కరువు పరిస్థితులు తప్పేలా లేవు.

– విక్రం కోటిబాబు, రైతు, మర్రివలస

పిట్ట గోడలపై .. చిట్టి తొట్టెలు





నీటితో పాటు ఆహారం..

- పక్షుల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు
- నిరంతరం నీటిని అందిస్తున్న సేవకులు



పక్షుల కోసం పిట్టగోడపై తొట్టెలో సిద్ధంగా ఉంచిన నీరు

శ్రీకాకుళం కల్చరల్ : వేసవికి దీటుగా ఎండలు భగ్గుమంటున్నాయి. కొద్దిసేపు బయటకు వచ్చిన దాహార్తిని తట్టుకోలేక శీతల పానియాలు, కొబ్బరి బొండాలు వంటివి తీసుకోక తప్పని పరిస్థితి. మనకే ఇలా ఉంటే పశుపక్ష్యాదుల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. వరుణుడి కరుణ లేక చెరువులు, ఇతర నీటి వనరులు ఎండిపోవడంతో దాహార్తితో అలమటిస్తున్నాయి. ముఖ్యంగా నగరంలో పక్షుల పరిస్థితి దారుణంగా ఉంటోంది. ఈ నేపథ్యంలో కొందరు సమాజ సేవకులు ముందుకొస్తున్నారు. తమ ఇంటి పిట్ట గోడలు, డాబాలపై చిన్నపాటి నీటితొట్టెలను పక్షుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నారు. నిరంతరం నీటిని అందుబాటులో ఉంచుతూ దాహార్తి తీర్చుతున్నారు. మరికొందరు వాటి కోసం గూడు సైతం ఏర్పాటు చేస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు.



డాబాపై ప్లాస్టిక్ డబ్బాలలో నీరు..

ప్రతి వేసవిలోనూ..



పక్షులు మానవ జీవనానికి ఎంతో తోడ్పడతాయి. వాటిని సంరంక్షించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది. వాటికి నీరు ఆహారం అందించేందుకు ప్రతి వేసవిలోనూ నీటి తొట్టెలు వంటివి ఏర్పాటు చేస్తాను. వాటి కోసం వ్యర్థ వస్తువులతో ప్రత్యేక గూడు ఏర్పాటు చేస్తుంటాను.

– ఉర్లాం శివతేజ, సామాజిక సేవకుడు

28న 'బుద్ధునితో నా ప్రయాణం' నాటక ప్రదర్శన



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బహుజన నేతలు

శ్రీకాకుళం కల్చరల్ : బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ సమర్పణలో ఈ నెల 28న బుద్ధునితో నా ప్రయాణం (అంబేడ్కర్ బౌద్ధ ధర్మ పునర్జీవణ నేపథ్యం) అనే తెలుగు నాటక ప్రదర్శన ఉంటుందని బహుజన నేతలు తెలిపారు. ఈ మేరకు శ్రీకాకుళంలోని అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రంలో బుధవారం పోస్టర్ ఆవిష్కరించారు. 80 అడుగుల రోడ్డులో ఉన్న బృందావన్ ఫంక్షన్ హాలులో జరిగే నాటక ప్రదర్శనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దళిత ఆదివాసీ బహుజన సంఘాల జేఏసీ నాయకులు కల్లేపల్లి రామ్‌గోపాల్, తైక్వాండో శ్రీను, డాక్టర్ కంఠ వేణు, బోయిన మురళీకృష్ణ, యజ్జల గురుమూర్తి, పురుషోత్తం రాంబాబు, పెయ్యల చంటి, ఎస్.సూర్యనారాయణ, జోగినాయుడు, ముద్దాడ శేఖర్, బోయిన వికాస గౌతమ్, సిద్ధార్థ, గోడె వెంకట నగేష్, అబ్బాస్, కల్యాణ్, నాగరాజు పాల్గొన్నారు.

అయ్యప్పకు అలంకరణ



శ్రీకాకుళం కల్చరల్: బలగ అయ్యప్ప దేవాలయంలో బుధవారం స్వామివారికి క్షీరాభిషేకాలు జరిగాయి. అర్చకులు దేవరకొండ శంకర నారాయణ శర్మ, మణిదీపక్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

కలెక్టర్, జేసీలకు అభినందనలు



కలెక్టర్‌కు మొక్కను బహూకరిస్తున్న క్లబ్ ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా జీడి పప్పునకు జాతీయ స్థాయిలో గుర్తింపురావడంతో అవార్డు అందుకున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌లను హర్షవల్లి లయన్స్ క్లబ్ ప్రతినిధులు బుధవారం అభినందించారు. వన్ నేషన్ వన్ ప్రొడక్ట్ విభాగంలో జీడిపప్పును గుర్తిస్తూ ఢిల్లీలో ఇటీవల అవార్డు అందజేసిన సంగతి తెలిసిందే. అభినందనలు తెలిపిన వారిలో ప్రెసిడెంట్ హారిక ప్రసాద్, డాక్టర్ సత్యస్వరూప్, సెక్రటరీ లక్ష్మణ్, చైర్మన్ నీహార్ చందక తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ నగర కార్యదర్శిగా రోహిత్



రోహిత్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నగర కార్యదర్శిగా దొండపాటి రోహిత్‌ను నియమించారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో నగర కార్యదర్శిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రోహిత్ మాట్లాడుతూ వ్యక్తి నిర్మాణం ద్వారా జాతీయ పునర్నిర్మాణం, 'జ్ఞానం, శీలం, ఏకత'లు శ్వాసగా మెరికలైన విద్యార్థుల రూపకల్పన లక్ష్యంగా ఏబీవీపీ ఆవిర్భవించిందన్నారు. దేశంలోనే కాకుండా ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంస్థగా అవతరించిందన్నారు. కుల, వర్గ, వర్ణాలకు అతీతంగా విద్యార్థులందరి నడుమ వారధిగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ బోర గోపి, కో కన్వీనర్ పల్లవి నారాయణరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తప్పులు లేని ఓటర్ల జాబితా లక్ష్యం



బీఎల్ఓలకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఆర్డీవో సాయిప్రత్యూష

శ్రీకాకుళం పాతబస్టాండ్/శ్రీకాకుళం రూరల్: తప్పులు లేని ఓటర్ల జాబితా తయారీ కోసమే బూత్ స్థాయి అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ కె.సాయి ప్రత్యూష అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో భారత ఎన్నికల సంఘం – ఇండియా ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెమొక్రసీ అండ్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ ఆదేశాల మేరకు బుధవారం శ్రీకాకుళం నియోజకవర్గంలో ఉన్న పోలింగ్ కేంద్రం 200 నుంచి 251 వరకు బూత్ లెవెల్ ఆఫీసర్లకు రెవెన్యూ గెస్ట్ హౌస్‌లో శిక్షణ నిర్వహించారు. ఓటర్ల జాబితా, క్లెయిమ్స్ , బీఎల్ఓ అప్లికేషన్, ఈసీఐ వెబ్‌సైట్‌పై అవగాహన కల్పించారు. ఇంటింటి సర్వే విధానంపై శిక్షణ నిర్వహించారు. అనంతరం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.గణపతిరావు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్, జి.కె.శ్రీనివాసరావు, బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం రేపు

రణస్థలం: రణస్థలం సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో ఈ నెల 18న పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ పైడి యోగేశ్వరరావు బుధవారం తెలిపారు. జె.ఆర్.పురం, రణస్థలం, రావాడ, కొండములగాం, కమ్మసిగడాం, వెల్పురాయి, దేవరపల్లి, అర్జునవలస, ఎం.నగరప్పాలెం, బంటుపల్లి, తిరుపతిపాలెం, పున్నానపాలెం, సంచాం గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

– పైడిభీమవరం సబ్ స్టేషన్ పరిధిలోని పిసిని ఫీడర్ పరిధిలో కోష్ఠ, దేరసాం, చిల్లపేటరాజాం, పిసిని, పతివాడపాలెం, వెంకటరావుపేట, వల్లభరావుపేట తదితర గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

రణస్థలం: ఎచ్చెర్ల సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ ఫీడర్ పరిధిలోని గ్రామాల్లో మరమ్మతుల నేపథ్యంలో ఈ నెల 18న విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈఈ పైడి యోగేశ్వరరావు తెలిపారు. కొత్తపేట, వెంకన్నగారిపేట, పొన్నాడ, తెప్పరేవు, సెగిడిపేట, ఎచ్చెర్ల, లింగాలపేట, ట్రిపుల్ ఐటీ క్యాంపస్, అనమిత్ర టౌన్‌షిప్, మాలముద్దాడ తదితర గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

ముగిసిన కోటి సమస్రనామ పారాయణం





పూర్ణాహుతి నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాండ్రంగి వీధిలో కామాక్షిదేవి పీఠంలో 20 రోజులుగా జరుగుతున్న కోటి సహస్రనామ పారాయణం బుధవారం పూర్ణాహుతితో ముగిసింది. పీఠం నిర్వాహకులు వేదుల సూర్యనారాయణశర్మ, వెంకటరమణశర్మ నేతృత్వంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది.

యువతి అదృశ్యం

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్సు వద్ద ఓ యువతి అదృశ్యమైనట్లు రెండో పట్టణ సీఐ ఈశ్వరరావు బుధవారం తెలిపారు. హిరమండలం పింద్రువాడకు చెందిన యువతి (24) నగరంలోని తన సోదరి ఇంట్లో కొంతకాలంగా ఉంటోంది. ఈ నెల 7న పింద్రువాడకు వెళ్తాననడంతో ఆమె బావ కాంప్లెక్సుకు ద్విచక్రవాహనంపై దిగబెట్టాడు. ఆరోజు నుంచి కనిపించకపోవడంతో తెలిసిన బంధువులు, స్నేహితుల వద్ద వాకబు చేసినా ఆచూకీ లేకపోవడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

అమ్మకాలు అంతంతే..!

- మార్కెట్‌పై ఆషాఢ మాసం ఎఫెక్ట్
- ముహూర్తాలు లేక తగ్గిన అమ్మకాలు
- వెలవెలబోతున్న వ్యాపార సముదాయాలు



జీటీ రోడ్డులో వస్త్ర దుకాణాల సముదాయం

శ్రీకాకుళం కల్చరల్ :

మార్కెట్‌లో వస్త్ర, వ్యాపార, బంగారు దుకాణాలు వెలవెలబోతున్నాయి. ఆషాఢ మాసం కావడం.. పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలకు ముహూర్తాలు లేకపోవడంతో అమ్మకాలు అంతంతమాత్రంగానే సాగుతున్నాయి. జూన్ 26న ప్రారంభమైన ఆషాఢమాసం జూలై 24 వరకు కొనసాగనుంది. అందులోనే గురుమూఢం కూడా వచ్చింది. దీంతో పెళ్లిళ్లు, గృహప్రవేశాలు, శంకుస్థాపనలు వంటి కార్యక్రమాలు ఉండవు. దీంతో వస్త్రాలు, బంగారం, పూజా సామగ్రి, ఫ్యాన్సీ వస్తువుల అమ్మకాలు బాగా తగ్గిపోయాయి. షాపింగ్ మాల్స్, జ్యూయలరీ షాపులు ఆశించిన మేర విక్రయాలు లేక వెలవెలబోతున్నాయి. ముఖ్యంగా చిన్న, మధ్యతరహా వస్త్ర విక్రయ కేంద్రాలపై ఈ ప్రభావం ఎక్కువగా ఉంది. కార్పొరేట్ సంస్థలు మాల్స్ ఏర్పాటు చేయడంతో కొనుగోలుదారులు లేక నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కేంద్రంలోని నెహ్రూ రోడ్డు, కళింగ రోడ్డు, పాలకొండ రోడ్డులో షాపుల్లో విక్రయాలు కనీస స్థాయిలో కూడా జరగడం లేదు.

ఉపాధి లేక..

శుభకార్యాలు లేకపోవడంతో ఆయా రంగాలపై ఆధారపడిన భాజా భజంత్రీలు, డెకరేషన్స్ నిర్వాహకులు, కర్పూర దండల షాపులు, లైటింగ్, మైక్‌సెట్ చేసే నిర్వాహకులకు ఉపాధి కరువైంది. పెళ్లి మండపాలు కూడా ఖాళీగానే ఉంటున్నాయి. వీటిపై ఎంతో మంది కుటుంబాలు ఆధారపడి ఉన్నాయి. పెళ్లిళ్లు నిర్వహించే పురోహితులకు కూడా ఎటువంటి ఆదాయం లేకుండాపోయింది. ముఖ్యంగా వస్త్ర వ్యాపారులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. కార్పొరేట్ వ్యాపార సంస్థల్లో సైతం ఆశించిన స్థాయిలో విక్రయాలు లేవు. దీంతో వారంతా డిస్కౌంట్లు, లక్కీడ్రా పేరిట ప్రత్యేక ఆఫర్లు పేరిట ఊరిస్తున్నా జనాల్లో ఆదరణ అంతంతమాత్రంగానే కనిపిస్తోంది.

ఆశించిన స్థాయిలో లేవు



రెండు మాసాలుగా వ్యాపారాలు ఆశించిన స్థాయిలో లేవు. ముఖ్యంగా వస్త్ర వ్యాపార రంగంలోకి కార్పొరేట్ సంస్థలు వచ్చేశాయి. సామాన్యులు సైతం షాపింగ్ మాల్స్‌లో వస్త్రాలు కొనుగోలు చేస్తున్నారు. యువత ఆన్‌లైన్‌లో షాపింగ్ యాప్‌ల్లో వస్త్రాలు కొనుగోలు చెయడానికి ఆసక్తి చూపుతున్నారు. దీంతో చిన్న, మధ్యతరహా వ్యాపారాలు మూతపడే పరిస్థితికి వచ్చాయి.

– శిల్లా చిట్టి, వస్త్ర వ్యాపారి, నెహ్రూరోడ్, శ్రీకాకుళం